నమస్తే తెలంగాణ





ఈ రేస్‌పై చర్చకు పట్టుబడుతూ శాసనసభలో స్పీకర్ పోడియం ఎదుట ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు




బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులను తప్పుబడుతూ శాసనమండలి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్సీలు

# కేటీఆర్‌పై కేసు అక్రమం

ఫార్ములా ఈ-కార్ రేస్‌పై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ • దద్దరిల్లిన ఉభయసభలు.. పోడియం ఎదుట ఆందోళన

చర్చకు అనుమతించని స్పీకర్, మండలి చైర్మన్ • అసెంబ్లీ, మండలిలో పట్టువీడని బీఆర్ఎస్ సభ్యులు

హోరెత్తిన నినాదాలు.. ఒకటికి రెండుసార్లు వాయిదా • అసెంబ్లీలో నిరసనల మధ్యనే పొంగులేటి ప్రసంగం

అసెంబ్లీలో పోటాపోటీగా అధికార, ప్రతిపక్షాల నినాదాలు • శాసన మండలిలో చేతులెత్తేసిన సర్కార్.. సభ నేటికి వాయిదా

- మేం తప్పు చేయలేదు.. రాష్ట్రం కోసమే పనిచేశాం
- తప్పు అంటున్నవారు చర్చ పెట్టి అదేమిటో చెప్పండి
- ఎమ్మెల్యే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారు
- ఆయనకు చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి
- అసెంబ్లీలో హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు శుక్రవారం ఉభయసభల్లో ప్రకంపనలు సృష్టించింది. కేసుపై చర్చించాలని పట్టుబడుతూ బీఆర్ఎస్ సభ్యులు చేపట్టిన ఆందోళనలతో శాసనసభ, శాసనమండలి దద్దరిల్లాయి. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనల మధ్యనే భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించగా, మండలిలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో అధికారపార్టీ పూర్తిగా విఫలమైంది. మండలిలో శుక్రవారం మూడు బిల్లులను ప్రవేశపెట్టాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. కేటీఆర్‌పై కేసును నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉభయసభలకు హాజరయ్యారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చించాలని ఉభయసభల్లోనూ పట్టుబట్టి, సభను అడ్డుకున్నారు. దీంతో ఒకటికి రెండుసార్లు ఉభయసభలు వాయిదాపడ్డాయి. శాసనమండలిలో మూడోసారి సమావేశమైన తరువాత కూడా సభ అదుపులోకి రాకపోవడంతో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు.

### దమ్ముంటే ఉంటే చర్చపెట్టండి

శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకాగానే భూభారతిపై చర్చను చేపట్టనున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చను అనుమతించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. రెండు చేతులెత్తి దండం పెడుతూ.. 'స్పీకర్ సార్ చర్చకు అనుమతించండి' అని విజ్ఞప్తి చేశారు. 'ప్రశ్నోత్తరాలు ఎలాగూ లేవు. రాత్రి 12 గంటల వరకు చర్చిద్దాం.. ఈ-కార్ రేసింగ్‌పై చర్చకు అనుమతించాలి' అని కోరారు. ప్రభుత్వానికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. అయినా స్పీకర్ అనుమతించలేదు.

### కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకే

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని, ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా తాము కూడా ప్రజలకు చెప్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెట్టింది అక్రమ కేసు కాకుంటే సభలో చర్చించాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

### కొనసాగిన ఆందోళన..

మళ్లీ సభ ప్రారంభంకాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు. భూ భారతిపై చర్చ అనంతరం తన చాంబర్‌కు పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు శాంతించలేదు. ఇదే సమయంలో మంత్రి పొంగులేటికి స్పీకర్ మాట్లాడే అవకాశమిచ్చారు. భూ భారతిపై మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఆ తర్వాత బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు 'బడే భాయ్.. ఛోటే భాయ్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదావేశారు. విరామం తర్వాత అసెంబ్లీ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. నిరసనగా బయటకు వెళ్లిపోయారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనకు పోటీగా అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. కొందరు సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సీట్ల వైపు దూసుకొచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అత్యంత వేగంగా హరీశ్‌రావును సమీపించారు. 55 మంది మార్షల్స్ సభలో మోహరించారు.

### ఆ ఎమ్మెల్యే వైఖరి వివాదాస్పదం

సభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య వైఖరి వివాదాస్పదమైంది. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆయన పేపర్ విసిరే ప్రయత్నం చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఆ తర్వాత ఆయన చెప్పు తీసి విసరబోయారని, వాటర్ బాటిల్ విసిరేయబోయారంటూ సోషల్ మీడియాలో వార్తలొచ్చాయి. ఇటీవలే వీర్లపల్లి శంకరయ్య వెలమ కులంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భౌతిక దాడులకు దిగుతామని బెదిరించారు. 'వెలమల్లారా ఖబర్దార్.. కుట్రలు చేసే వెలమల వీపులు విమానాలు మోగుతాయ'ంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఈ నేపథ్యంలో తాజా వివాదం మొదలైంది.

## మండలిలో చేతులెత్తేసిన సర్కార్

- పది నిమిషాలైనా సాగకుండానే సభ వాయిదా
- మూడు బిల్లులు ప్రవేశపెట్టలేకపోయిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలంటూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన ఆందోళనలతో శాసనమండలి దద్దరిల్లింది. ఒకటికి రెండుసార్లు సభను వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రావడంతో చివరకు ఏ చర్చా జరగకుండానే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో హాజరైన బీఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని స్తంభింపచేశారు. కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలని ఆందోళనకు దిగారు. సభ సాగకపోవడంతో చైర్మన్ తొలుత 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. ఉదయం 11:20 గంటలకు మండలి సమావేశం తిరిగి ప్రారంభమైనప్పటికీ, బీఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. చర్చ లేకుండానే చైర్మన్ సభను శనివారానికి వాయిదా వేశారు. బీఆర్ఎస్ సభ్యులు మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు.

### చైర్మన్ వారించినా

కేటీఆర్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలని సభలో చర్చ పెట్టాలన్న డిమాండ్లతో ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ సభ్యులను మండలి చైర్మన్ వారించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. కేసుపై చర్చ జరగాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో చైర్మన్, మంత్రులు నిశ్చేష్టులయ్యారు.

### లోకం పోకడ




ఐదేళ్లలో ఆరు గ్యారంటీలు అమలు చేయడం ఎలా? పుస్తకం వుందా?

## విపక్షాలకు మైక్ కట్

- మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడ్తరు
- కొత్త రూల్.. అంటూ పోలీసుల దబాయింపు
- అధికారపక్షానికి మాత్రం అన్ని అనుమతులు
- బీఆర్ఎస్ సభ్యులకు అడుగడుగునా ఆంక్షలే..

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అధికారపక్షం ఏది చేసినా ఒప్పే.. ప్రతిపక్షం ఏది చేసినా తప్పే.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ సర్కారు. శాసనసభలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. సభలో, మీడియా పాయింట్ వద్ద మాట్లాడే విషయంలో, నిరసన తెలిపే అంశంలో ఈ వ్యత్యాసాలు స్పష్టంగా కనిపించాయి. శాసనసభలో తమ అభిప్రాయం చెప్పేందుకు విపక్షాలకు మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు బీఆర్ఎస్ సభ్యులు మీడియా ఎదుట వాపోయారు. సభను వాకౌట్‌చేసి మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకూ విపక్షానికి అవకాశం ఇవ్వడం లేదు. కొత్త రూల్ అంటూ పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం సభను వాకౌట్ చేసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు వస్తుండగా.. పది మంది మార్షల్స్ అడ్డుకున్నారు. వాకౌట్‌కు కారణాలు, సభలో పరిస్థితులపై మీడియా ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లో ప్రధాన ప్రతిపక్షం గొంతు వినిపించకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంటున్నారు. అధికారంలో ఉండి కూడా అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమో అధికారపక్ష ఎమ్మెల్యేలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపడంపైనా సర్కారు ఆంక్షలు విధిస్తున్నది.

## అలంపూర్ చౌరస్తాలో సినీ నటుడు



లేపాక్షి రెస్టారెంట్‌లో సినీనటుడు ప్రదీప్ కొండిపర్తి

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 20: అలంపూర్ చౌరస్తా పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో ఉన్న లేపాక్షి రెస్టారెంట్‌లో ఎఫ్2, ఎఫ్3 సినీనటుడు ప్రదీప్ కొండిపర్తి సందడి చేశారు. లేపాక్షి ఓనర్ భాస్కర్‌రెడ్డి వారిని స్వాగతం పలికి రెస్టారెంట్‌ను చూపించారు.

## కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి



నిరసనలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

నారాయణపేట, డిసెంబర్ 20 : అంబేద్కర్‌ను అవమానపరిచే పద్ధతిలో మాట్లాడిన కేంద్రం హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద సీఐటీయూ, వ్యవసాయకార్మిక సంఘం, రైతుసంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం, కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ పాల్గొన్నారు.

### బర్తరఫ్ చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 20 : పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపర్చేలా మాట్లాడడంపై సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి రాజ్యాంగా పరిరక్షణ, ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసేలా మాట్లాడడాన్ని సహించేది లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి కురుమూర్తి, నాయకులు చంద్రకాంత్ పాల్గొన్నారు.

## గేదెపై శునకం సవారీ



గేదెపై పడుకున్న కుక్క

హన్వాడ, డిసెంబర్ 20 : మండలంలోని టంకర-దచ్చక్‌పల్లి గ్రామాల మధ్యలో రోడ్డు పక్కన ఓ రైతు తనపొలంలో గేదెలను కట్టేయగా, శునకం ఓ గేదెపై సవారీ చేస్తున్నట్లుగా కూర్చొని ఉండగా, అటుగా వెళ్లేవారు ఈ దృశ్యాన్ని చూసి నవ్వుకున్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు పితృవియోగం



తిమ్మాజిపేట, డిసెంబర్ 20 : నాగర్‌కర్నూల్ మాజీఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి తండ్రి మర్రిజంగిరెడ్డి (82) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. హైదరాబాద్‌లోని మర్రి స్వగృహంలో ఆయన కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురై కోలుకున్న ఆయన అకస్మాత్తుగా మృతి చెందాడు. భార్య, మర్రిజనార్దన్‌రెడ్డితో మరో కుమారుడు, కుమార్తె ఉన్నారు. నేర్లపల్లిలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అంత్య క్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## పోటీ ప్రపంచంలో సాఫ్ట్‌స్కిల్స్ తప్పనిసరి

- పీయూ రిజిస్ట్రార్ చెన్నప్ప




వర్క్‌షాప్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ చెన్నప్ప

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 20 : నేటి పోటీ ప్రపంచంలో సాఫ్ట్‌స్కిల్స్ తప్పనిసరి అని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్నప్ప సూచించారు. శుక్రవారం పీయూ ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఎంసీఏ, ఎంబీఏ విభాగాలు సంయుక్తంగా సాఫ్ట్‌స్కిల్స్, ఉద్యోగ అవకాశాలపై నిర్వహించిన కార్యశాల (వర్క్‌షాప్)కు రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందిపుచ్చుకోవడం ద్వారా సమర్థవంతమైన కమ్యూనికేషన్ స్కిల్స్, పరిష్కార మార్గాల్లో సమర్థత, టీమ్ వర్క్, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్ స్కిల్స్ ఎలా అభివృద్ధి చేసుకోవాలనే అంశాలను మ్యాజిక్ బస్ ట్రైనర్ తౌఫిక్ అహ్మద్ భారీ వివరించారు.

కార్యక్రమంలో ఓఎస్డీ టూ వీసీ మధుసూదన్‌రెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి గౌస్‌మొయినొద్దీన్, ఎంబీఏ విభాగాధిపతి నాగసుధ, ఫార్మసీ విభాగాధితి ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు అర్జున్‌కుమార్, సబిత, జావేద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో నకిలీ లేబర్ అధికారుల అవతారం

- ఇటుక బట్టీల వద్ద వసూళ్ల దందా
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితులు
- బాధితుడి కంటే ముందుగానే స్టేషన్‌లో ప్రత్యక్షమైన దుండగులు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 20: లేబర్ అధికారులమని చెప్పి మీతో మైనర్లు పనిచేస్తున్నారని బెదిరించి కొందరు దుండగులు వసూళ్లకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. జిల్లాలోని తాడూరు మండలం ఐతోలు శివారులో ఇటుక బట్టీల వద్దకు కొందరు దుండగులు గురువారం వెళ్లారు. తాము లేబర్ ఆఫీసర్లమని పరిచయం చేసుకున్నారు. మీ వద్ద మైనర్లు పనిచేస్తున్నారని, మీ లేబర్ కార్డులు చూపించండని దబాయించారు. ఇంతలో మరో వ్యక్తి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్‌లోని ఆఫీస్ వద్దకు రావాలని హుకుంజారీ చేశారు. దీంతో భయాందోళనకు గురైన సదరు యజమాని నిజంగానే లేబర్ ఆఫీసర్లు ఉంచొచ్చని బతిమాలడం ప్రారంభించాడు. ఎంతోకొంత ముట్టజెప్పడానికి ప్రయత్నించినా వినకుండా అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారు. ఎంత డిమాండ్ చేశారో తెలియదు కానీ చివరకు 50 వేలకు బేరం కుదిరింది. దీంతో సదరు ఇటుకబట్టీ యజమాని తన అకౌంట్‌లో నుంచి ముందుగా రూ.30 వేల రూపాయలను ఫోన్‌పే ద్వారా దుండగుల్లో ఒకరికి ట్రాన్సర్ చేశారు. మిగతా అమౌంట్‌ను తర్వాత ఇచ్చేలా సర్ధిచెప్పుకున్నారు. కాగా ఆఫీసర్లుగా వచ్చిన వారిపై సదరు యజమానికి అనుమానం వచ్చింది. తనకు తెలిసిన వారితో విషయం చెప్పడం, ఫోన్‌పే ద్వారా 30 వేలు పంపిన ఫోన్ నెంబర్‌ను చూపించగా నకిలీ వ్యక్తులను గుర్తించారు. దీంతో తమ బట్టీల వద్దకు వచ్చిన వారు లేబర్ ఆఫీసర్లు కాదని, నకిలీ అధికారులని తెలుసుకున్నాడు. దీంతో మోసపోయానంటూ ఫిర్యాదు చేసేందుకు అదేరోజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళిన యజమాని షాక్‌కు గురయ్యాడు. తనతో నకిలీ లేబర్ అఫీసర్లమని చెప్పిన దుండగులు తనకంటే ముందుగానే స్టేషన్‌లో కనిపించడంతో ఖంగుతిన్నాడు. అప్పుడు అర్థమైంది యజమానికి తనకు నిజం తెలిసి పోలీస్‌స్టేషన్‌కు తప్పకుండా వస్తాడని బేరం ఆడేందుకు తనకంటే ముందుగానే వచ్చారని. కొద్దిసేపు దుండగులకు యజమానికి వాగ్వాదం చోటు చేసుకోగా మరికొందరు వచ్చి సర్ధిచెప్పి ఇటుకబట్టి యజమాని డబ్బులు 30వేలను తిరిగి మళ్ళీ ఫోన్‌పే చేయించి కేసు పెట్టకుండా అడ్డుకున్నారు. దీంతో యజమాని తన డబ్బులు తనకు వచ్చాయని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. ఇదిలా వుండగా ఇలాంటి సంఘటనే ఇటీవల జిల్లా కేంద్రంలో ఓ ప్రధానకూడలిలో చోటుచేసుకున్నది. సావుకారి లూజుగా మంచినూనె అమ్ముతుండగా కొందరు కిందగులు వచ్చి నకిలీ నూనెను కల్తీ చేస్తున్నావంటూ బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇటీవల తెలకపల్లిలోనూ ఓ మెడికల్ దుకాణంలో ఓ మహిళకు ప్రెగ్నెన్సీ పోయేందుకు నకిలీ మందులు ఇచ్చావంటూ బెదిరించి దాదాపు 1లక్షా 50 వేలవసూలు చేసినట్లు తెలిసింది. ఇందులో నిజం ఎంతో తెలియదు కానీ ఇలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం కొసమెరుపు.

### ఇసుక ట్రాక్టర్ బోల్తా

దేవరకద్ర, డిసెంబర్ 20 : మండలంలోని నాగారం శివారులో ఇసుక ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్ద రాజమూర్ సమీపంలోని వాగు నుంచి ఆక్రమంగా ఇసుకను తరలిస్తుండగా, గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు.

### జిల్లా తాసీల్దార్ల సంఘం అధ్యక్షుడిగా జమీల్ ఎన్నిక

మరికల్, డిసెంబర్ 20 : జిల్లా తాసీల్దార్ల అసోసియోషన్ అధ్యక్షుడిగా తాసీల్దార్ జమీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో గిర్దావర్ సుధాకార్‌రెడ్డి, సిబ్బంది శ్రావణ్, చరణ్, రవి పాల్గొన్నారు.

### ఖగోళ విజ్ఞానంపై అవగాహన

కోస్గి టౌన్, డిసెంబర్ 20 : అరుదుగా సంభవించే ఆసక్తికర అకాశవింతలను ఆస్వాదిస్తూ విషయ పరిజ్ఞానం విస్తృత పర్చుకోవాలని సైన్స్ ఉపాధ్యాయులు సిద్ధి రాములు, మల్లేశం అన్నారు. శుక్రవారం మండలంలోని మిర్జాపూర్ ఉన్నత పాఠశాలలో ఖగోల అద్భుతాలు-పరిశీలన అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ భ్రమణంలో భాగంగా సూర్యుడి, భూమిమధ్య దూరం ఏడాదిలో ఓసారి పెరగడం, తగ్గడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

## మైనర్ల ర్యాష్ డ్రైవింగ్

- తప్పిన ప్రమాదం.. ఊపిరి పీల్చుకున్న స్థానికులు
- దెబ్బతిన్న కాంగ్రెస్‌పార్టీ నాయకురాలి కారు



కాంగ్రెస్ నాయకురాలికి చెందిన కారు



పాక్షికంగా దెబ్బతిన్న కారు

గద్వాల అర్బన్, డిసెంబర్ 21 : మైనర్ బాలురు ర్యాష్ డ్రైవింగ్ చేసూత స్థానికులను భయాందోళనకు గురి చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల హౌసింగ్ బోర్డు కాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఇంటికి శుక్రవారం అధికార పార్టీకి చెందిన ఓ మహిళా నాయకురాలు వచ్చింది. ఆమెతోపాటు బంధువులైన ముగ్గురు మైనర్ బాలురు వచ్చారు. ఆమె ఇంట్లోకి వెళ్లాక కారు తాళం తీసుకొని ముగ్గురూ బయటకు వెళ్లారు. కాలనీలో అజాగ్రత్తగా వాహనం నడుపుతూ స్థానికుల్లో భయాందోళన కలిగేలా వ్యవహరించారు. ఈ క్రమంలో చైర్మన్ ఫార్చునర్ కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలుకాలేదు. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోలీసులను వివరణ కోరగా.. అందుబాటులోకి రాలేదు.



పోస్టాఫీసులో తెరిచి ఉంచిన బీరువాలు

### పోస్టాఫీస్‌లో చోరీ

దేవరకద్ర, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని పోస్టాపీస్‌లో దొంగలు పడినట్లు పోస్ట్‌మాస్టర్ జనార్దన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రోజు మాదిరిగా విధులు ముగించుకొని పోస్టాపీస్‌కు తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటలకు కార్యాలయానికి వచ్చి చూడగా, తాళం విరిగి ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వారు పరిశీలించగా, కార్యాలయంలో బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రెండు పార్శిళ్లతో పాటు రూ.1,100లు దొంగిలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు.

### అరెస్టులైనాసరే.. ఉద్యమాన్ని కొనసాగిస్తాం


కోడేరు, డిసెంబర్ 20 : అక్రమ అరెస్టులు ఎన్నిచేసినా హామీలను నెరవేర్చేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆటోయూనియన్ నాయకుడు ఆటోరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు బయలు దేరుతున్న ఆటోడ్రైవర్లను పోలీసులు అరెస్టుచేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

### డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కల్వకుర్తిరూరల్, డిసెంబర్ 20 : డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరికి రెండు రోజులపాటు జైలుశిక్ష, మరొకరికీ ఒక రోజు జైలు శిక్షను సివిల్‌కోర్టు న్యాయమూర్తి కావ్య విధించినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. ముకురాలకు చెందిన సాయిబాబా, తర్నికల్‌కు చెందిన రామకృష్ణకు రెండురోజుల జైలుశిక్ష, రూ.100ల జరిమానా, ఎల్లికల్‌కు చెందిన భూపాల్‌గౌడ్ ఒక రోజు జైలుశిక్ష రూ.100 జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఏపీజీబీవీ సేవల్లో మార్పులు

- తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం
- ఈ నెల 28 నుంచి 31 వరకు అంతరాయం
- రీజినల్ మేనేజర్ రవి కిశోర్‌రెడ్డి



రవి కిశోర్ రెడ్డి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 20 : భారతప్రభుత్వ ఆర్థికసేవల విభాగం జారీ చేసిన ఉత్తర్వుల సంఖ్య 15/15/2015 (ఈ) ఆర్ఆర్‌బీ ప్రకారం ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విభజిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ రవికిశోర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్‌లోని ఏపిజీవీబీ రీజనల్ బ్యాంక్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని 493 ఏపీజీబీవీ శాఖలు జనవరి1వ తేదీ నుంచి హైదరాబాద్ ప్రధానకార్యాలయంగా ఉన్న తెలంగాణ గ్రామీణబ్యాంకులో విలీనం చేయబడిందన్నారు. ఈ క్రమంలో విభజన, విలీన ప్రక్రియలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా ఈ నెల 28వ తేదీ నుంచి ఈనెల 31వరకు అన్ని శాఖల్లో బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్ అందుబాటులో ఉండవన్నారు. అసౌకర్యానికి చింతిస్తున్నామని, తిరిగి బ్యాంక్‌సేవలు జనవరి1వ తేదీనుంచి తెలంగాణ వ్యాప్తంగా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ మేరకు బ్యాంకు ఖాతాదారులందరూ సహకరించి ఆర్థిక లావాదేవీలను ఈనెల 27వతేదీలోగా పూర్తిచేసుకోవాలని సూచించారు. ఏటీఎం కార్డు మార్చుకునేందుకు బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు శాఖను సంప్రదించాలన్నారు.